సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



రుణాలెప్పుడిస్తారో..?

బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు నాలుగేళ్లుగా నోటిఫికేషన్ వెలువడకపోవడంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. 8లో



ప్లాట్ల పంపిణీలో వివాదం

జీటీపీఎస్‌కు బొగ్గు రవాణా రైల్వేలైన్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద చేపట్టిన ప్లాట్ల పంపిణీలో వివాదం చోటుచేసుకుంది. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
35° / 18°

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి వేళ కొంత మేర చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. మొదట ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను కలెక్టర్ అనుదీప్ శనివారం తనిఖీ చేశారు. గోదాంకు వేసిన తాళం సీల్‌ను, సీసీ కెమెరాలను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవీఎం గోదాం వద్ద పటిష్ట పర్యవేక్షణ, నిఘా కొనసాగించాలని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎం గోదాంను తనిఖీ చేసి రక్షణ ఏర్పాట్లను పరిశీలించి నివేదిక పంపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీఆర్ఓ అశోకచక్రవర్తి, ఏట గన్యా, ఎన్నికల సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

తొలిరోజు 'గేట్' ప్రశాంతం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్: స్థానిక అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో తొలిరోజు శనివారం జరిగిన గేట్ – 2023 ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 73 మంది హాజరు కావాల్సి ఉండగా 66 మంది, మధ్యాహ్నం పరీక్షకు 79 మందికి గాను 67 మంది హాజరయ్యారు. ఆదివారం కూడా పరీక్షలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా



సర్టిఫికెట్ అందుకుంటున్న చంద్రకళ

అశ్వాపురం: హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 2 నుంచి 5 వరకు జరుగుతున్న ఆలిండియా మాస్టర్ చాంపియన్‌షిప్ నేషనల్ లెవల్ అథ్లెటిక్ పోటీల్లో మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన మోర్తినేని చంద్రకళ సత్తా చాటింది. ఐదు పతకాలు గెలుచుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీల్లో హేమర్‌త్రో, డిస్కస్‌త్రో, జావలిన్ త్రో పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకుంది. షాట్‌పుట్, 100 మీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఐదు పతకాలు సాధించిన చంద్రకళ దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బాణోత్ శారద అభినందనలు తెలిపారు.

11నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలను ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఐడీ, పుట్టిన తేదీ ఆధారంగా www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక క్షేత్రంలో కళ కళ !





అంతర్రాష్ట్ర నాటకోత్సవాల్లో కళాకారుల ప్రదర్శన (ఫైల్)

- నేటి నుంచి 21వ అంతర్ రాష్ట్ర నాటక పోటీలు
- మూడు రోజుల వేడుకలకు వేదికగా భద్రాద్రి
- హాజరు కానున్న ప్రముఖ కళాకారులు

SUNDAY SPECIAL

భద్రాచలం: భద్రాచలం అంటే గుర్తొచ్చేది దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన క్షేత్రం. రామయ్య కొలువైన భద్రగిరి. కానీ ఇప్పుడు వీటికి అదనంగా కళలకు కాణాచి.. కళాకారులకు దిక్సూచి.. కళల పండుగకు వేదికగా నిలుస్తున్న 'భద్రాద్రి కళాభారతి' సైతం స్ఫురణకు వస్తుంది. కళా ప్రదర్శనలే కాక రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరు గాంచిన కళాకారులను ఇక్కడికి రప్పించడం, రామయ్య సన్నిధిలో పూజలు చేయించి, వారిని సత్కరించడం సంప్రదాయంగా వస్తోంది. అంతరించి పోతున్న నాటక రంగాన్ని బతికించడంతో కళాకారులకు ఆదరణ పెంచేలా భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. దీంతో భద్రాచలం అంటే శ్రీసీతారామచంద్రస్వామి వారికి పూజలే కాకుండా కళారంగంలోనూ ఏ మాత్రం తీసిపోని విధంగా గుర్తింపు లభిస్తోంది.

ముచ్చటగా మూడు రోజులు..

భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కళల పండుగకు వేదిక కానుంది. జిల్లాతో పాటు కరీంనగర్, పిఠాపురం, విజయవాడకు చెందిన కళాకారులచే నాటక ప్రదర్శనలు, జబర్దస్త్ ఫేం షరీఫ్ మిమిక్రీ, చాణిక్య టీమ్ వారి హాస్యవల్లరి, గాయని రాణి 'జానపద పాటల సంబరం'తో పాటు పలు శాస్త్రీయ, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు కళాభిమానులను అలరించనున్నాయి. అలాగే సినీ గేయ రచయిత, జానపద గాయకులు గిద్దె రామనర్సయ్య, గాయని తేజస్వినితో పాటు పలువురికి ఆత్మీయ సత్కారాలు ఉంటాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజుకొక రంగానికి చెందిన వారిని సత్కరిస్తారు.


ఇంతింతై వటుడింతై అన్నట్టుగా..

భద్రాచలం ఆర్టీసీ డిపోలో పనిచేసే ఆరుగురు చిరుద్యోగులతో ప్రారంభమైన భద్రాద్రి కళాభారతి ఇంతింతై వటుడింతై అన్నట్టుగా నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తోంది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్న అల్లం నాగేశ్వరరావు, అతడి సహచర మిత్రులు నర్సింహారావు, రామరాజు శ్రీనివాస్, ప్రతాప్, తిరుపతితో పాటు రెండేళ్ల క్రితం మృతిచెందిన పులిరాజు కలిసి 2001 ఆగస్టు 21న భద్రాద్రి కళాభారతిని స్థాపించారు. నాటి నుంచి ప్రతి సంవత్సరం స్థానికులు, ప్రముఖుల సహాయ సహకారాలతో పండుగలా కళా ప్రదర్శనలు నిర్వహిస్తుండడం విశేషం. స్థానిక కళాకారులను ప్రోత్సహించడంతో పాటు అంతర్ రాష్ట్ర నాటిక పోటీలు నిర్వహించి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్నారు.

గతంలోనూ పలువురికి సన్మానం..

నాటికలతో పాటు వివిధ కళారంగాల్లో ప్రఖ్యాతి గాంచిన కళాకారులను భద్రాచలం తీసుకొచ్చి అతిథి మర్యాదలతో సత్కరించడాన్ని కళాభారతి నిర్వాహకులు సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు కళాతపస్వి కె.విశ్వనాథ్, సుద్దాల అశోక్ తేజ, నూతన్‌ప్రసాద్, ఎల్‌బీ శ్రీరాం, కేకే శర్మ, తనికెళ్ల భరణి, గుండు హనుమంతురావు, చంద్రబోస్, జయప్రకాష్ రెడ్డి, కొండవలస, ఘంటాడి కృష్ణ, తెలంగాణ శకుంతల, గజల్ శ్రీనివాస్, శివశంకర్ మాస్టారు, ఏవీఎస్, గోరటి వెంకన్న, జయరాజు, మధుప్రియ, కవిత, శివకృష్ణ, చిత్రం శ్రీను, హీరో శ్రీకాంత్, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, ఆర్.నారాయణమూర్తి, రేలంగి శ్రీనివాసరావు, అడ్డాల శ్రీకాంత్, శివనాగులు వంటి అనేక మంది కళాకారులను ఈ వేదికపై సత్కరించారు.

కళను బతికించాలనేదే మా ప్రయత్నం



నేటి తరానికి కళల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వాటిని బతికించుకోవాలనేదే మా ప్రయత్నం. ఇందుకు స్థానిక ప్రముఖులు సైతం చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. వారి ఆర్థిక, హార్థిక సహకారంతోనే ఇనేళ్లుగా నాటకోత్సవాలను నిర్వహించగలుగుతున్నాం. అంతేకాక మాకు భద్రాద్రి రామయ్య ఆశీస్సులు సైతం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాం.

– అల్లం నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు

ఇలా ఇస్తే.. అయ్యేనా ?!

- దశాబ్దాలుగా సాగుతున్న భద్రాచలం రోడ్డు – కొవ్వూరు రైల్వేలైన్
- నిధుల విడుదలలో ఏటా కేంద్రం నిర్లక్ష్యమే...
- నానాటికీ పెరుగుతున్న అంచనా వ్యయం
- ఈసారి రూ.20 కోట్ల కేటాయింపు
- త్వరలో సత్తుపల్లి – అశ్వారావుపేట నడుమ భూసేకరణ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న భద్రాచలం రోడ్డు – కొవ్వూరు రైల్వేలైన్ ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని ఈ రైల్వేలైన్ కోసం నిధులు అంతంత మాత్రంగానే కేటాయిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) నుంచి సత్తుపల్లి వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయింది. ఆపై సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు నిర్మాణం జరగాల్సి ఉండగా, తాజా బడ్జెట్‌లో కేంద్రం రూ.20 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే ప్రాజెక్టు అంచనా వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యాన ఏటా రూ.20కోట్లు ఇస్తూ వెళ్తే లైన్ ఎప్పటికి పూర్తవుతుందనే ప్రశ్న తలెత్తుతోంది.

పదేళ్ల క్రితం మంజూరు

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు నేతలు భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) – కొవ్వూరు రైల్వేలైన్ సాధన కోసం కొవ్వూరు రైల్వేలైన్ సాధన సమితి పేరిట అనేక ఉద్యమాలు చేపట్టారు. దీంతో 2012–13 బడ్జెట్‌లో కేంద్రం రూ.1,445 కోట్ల అంచనా వ్యయంతో 151 కిలోమీటర్ల మేర రైల్వేలైన్‌ను మంజూరు చేసింది. అనంతరం ప్రాజెక్టును ఎల్లో బుక్‌లో కూడా నమోదు చేశారు. కానీ అరకొర నిధుల కేటాయింపుతో పనులు సాగకపోగా, అంచనా వ్యయం ఏటా పెరుగుతూ వస్తోంది. సత్తుపల్లి నుంచి కొత్తగూడేనికి బొగ్గు రవాణా కోసం సింగరేణి భాగస్వామ్యంతో 52.03 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం పూర్తి చేశారు. ఆపై సత్తుపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరు వరకు ఈ లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,154.83 కోట్లకు చేరుకుంది.

రూ.20 కోట్లు కేటాయింపు..

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భద్రాచలం రోడ్డు – కొవ్వూరు రైల్వేలైన్‌కు కేవలం రూ.20 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వరకు భూసేకరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అనంతరం మరిన్ని నిధులు విడుదలవుతాయని చెబుతున్నా స్పష్టత రావడం లేదు. పెద్దమొత్తంలో నిధులు విడుదల చేస్తే తప్ప ఈ లైన్‌కు భూసేకరణ, ఇతర పనులు చకచకా సాగే అవకాశం లేదు.

తగ్గనున్న దూరాభారం

భద్రాచలం రోడ్డు–కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి భద్రాచలంలో శ్రీ సీతారాములను దర్శించుకునేందుకు వచ్చే వారికే కాకుండా ఇతరులకూ అనుకూలంగా మారుతుంది. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లాలంటే 800 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుండగా.. ఈ లైన్ నిర్మిస్తే 150 కిలోమీటర్ల మేర తగ్గుతుంది. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విశాఖపట్నం నౌకాశ్రయాలకు బొగ్గు, గ్రానైట్ ఇతరత్రా రవాణా సులభమవుతుంది. ఇన్ని ఉపయోగాలున్న ఈ రైల్వే లైన్‌కు కేంద్రం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి.. త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఉమ్మడి జిల్లావాసులు కోరుతున్నారు.

తెలుగు రాష్ట్రాలపై కేంద్రం వివక్ష



కొత్తగూడెం – కొవ్వూరు రైల్వే లైన్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర రైల్వేలైన్లకు సంబంధించి నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపుతోంది. ఎన్నో పోరాటాలతో 2012–13లో మంజూరైన ఈ లైన్ ఇంకా పూర్తి కాలేదంటే కేంద్రం చూపిస్తున్న నిర్లక్ష్యమే కారణం. ఈ రైల్వేలైన్ పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిసినా పట్టించుకోవడం లేదు.

– కొదమసింహం పాండురంగాచార్యులు, కన్వీనర్, కొవ్వూరు రైల్వేలైన్ సాధన సమితి

వైభవంగా సహస్ర కలశావాహనం

నేడు రామయ్యకు వెయ్యి కలశాలతో అభిషేకం



కలశావాహనం చేస్తున్న అర్చకులు, పండితులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మాఘ మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సహస్రాభిషేకోత్సవాల్లో భాగంగా శనివారం కలశావాహనం కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. బేడా మండపంలో వెయ్యి కలశాలను వరుస క్రమంలో అమర్చి శాస్త్రోక్తంగా దేవతలను ఆవాహనం చేశారు. యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, కలశావాహనం, హవనం, మండప, వాస్తు పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామివారికి బేడా మండపంలో సహస్ర కలశాభిషేకం, రంగనాయకుల గుట్టపై వేంచేసి ఉన్న శ్రీ రంగనాథ స్వామికి వార్షిక తిరుకల్యాణోత్సవం జరపనున్నారు. ఈఓ శివాజీ దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు అందజేస్తారు. పూజలలో అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సహస్రకలశాభిషేకాన్ని పురస్కరించుకుని స్వామివారికి నిత్యకల్యాణం, పవళింపు సేవ రద్దు చేశారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయండి

- ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శిరీష

భద్రాచలంటౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలోని గర్భిణుల వివరాలు నమోదు చేయడంతో పాటు వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శిరీష అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శనివారం మాతా శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులకు రక్తహీనత సమస్య ఉంటే ఐరన్, ఫోలిక్‌యాసిడ్ ట్యాబ్లెట్లు, సెలైన్ పెట్టాలని, వారి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ఈడీడీ క్యాలెండర్ ఏర్పాటు చేసి హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి ముందుగానే ఆస్పత్రికి తరలించి, సురక్షిత ప్రసవం జరిగేలా చూడాలని చెప్పారు. రోడ్డు మార్గం సరిగా లేని గ్రామాల్లో ఉండే గర్భిణులను ముందుగానే పీహెచ్‌సీ పరిధిలోని బర్త్ వెయిటింగ్ రూమ్‌లలో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు, టీ హబ్ ద్వారా సుమారు 55 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజ్‌కుమార్, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చైతన్య, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, కంటి వెలుగు అధికారి డాక్టర్ పర్షియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను పటిష్ట పరుస్తున్నాం

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



మాట్లాడుతున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ఏజెన్సీలో గిరిజన విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. దుమ్ముగూడెం, ములకలపల్లి, మండలాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఈఎంఆర్ఎస్ భవనాల పనులపై శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో సంబంధిత ప్రిన్సిపాళ్లు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఆయా మండలాల్లో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, ప్రహరీ, డైనింగ్ హాళ్లు, డార్మెటరీ, తాగునీటి సౌకర్యం, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం తదితర పనులను ప్రిన్సిపాళ్లు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, తహసీల్దార్లు శేషగిరిరావు, చంద్రమోహన్, ప్రిన్స్‌పాళ్లు వీరస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు.. సగమే

- యాసంగి పంటలపై రైతుల అనాసక్తి
- జిల్లాలో 2,15,463 ఎకరాల్లో అంచనా
- ఇప్పటి వరకు 57 శాతమే నమోదు
- వానాకాలం కోతల తర్వాత బోసిపోతున్న పొలాలు



చంద్రుగొండ మండలంలో కోతల అనంతరం బోసిపోతున్న వరి పొలం



లక్ష్మీదేవిపల్లి మండలంలో సాగవుతున్న వరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగిలో పంటల సాగుకు రైతులు సుముఖత చూపడం లేదు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన పంటలే దీనికి నిదర్శనం. ఈ సీజన్‌లో జిల్లాలో మొత్తం 2,15,463 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గత యాసంగిలో 1,74,475 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది మరో 40,988 ఎకరాల్లో సాగు చేస్తారని భావించినా.. ఇప్పటివరకు 1,23,085 ఎకరాల్లో మాత్రమే పంటలు వేయడం గమనార్హం. గత యాసంగిలో ధాన్యం కొనేది లేదని మొదట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. అయితే ఈసారి కొనుగోళ్ల విషయంలో ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. గత యాసంగిలో 33,184 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి 78,762 ఎకరాల్లో సాగువుతుందని భావించినా.. ఇప్పటివరకు 22,056 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఇబ్బంది పడిన రైతులు.. ఈ సీజన్‌లో మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. అంతేకాక వానాకాలం సీజన్ ఆలస్యం కావడంతో యాసంగి పంటల సాగులోనూ జాప్యం జరిగింది. వానాకాలం వరి కోతలు పూర్తయిన చాలా పొలాల్లో ఇప్పటివరకు తిరిగి నాట్లు వేయకపోవడంతో అవి బోసిపోయి కనిపిస్తున్నాయి. అయితే ఈ యాసంగిలో నీటి వనరులు ఉన్న చోటపత్తి సాగు చేయాలని అధికారులు రైతులకు సూచించారు. గత యాసంగిలో 23 ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగు కాగా, ఈ ఏడాది యాసంగిలో 42 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. కాగా, ఇప్పటికి 55 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. నూనె పంటలలో ఆయిల్‌పామ్ మినహా మిగతా పంటలపై రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వేరుశనగ పంట మాత్రం ఆశాజనకంగానే ఉంది.

జిల్లాలో ఈ యాసంగిలో వివిధ పంటల సాగు వివరాలిలా.. (ఎకరాల్లో)

పంట	అంచనా	సాగైనది	శాతం
వరి	78,762	22,056	28
జొన్న	2,147	147	7
పత్తి	42	55	130
మొక్కజొన్న	26,156	14,529	56
మిర్చి	5,639	4,698	83
చెరకు	415	296	71
పొగాకు	762	346	45
పామాయిల్	48,604	38,757	80
కూరగాయలు	3,864	275	7
జనుము	282	102	36
వేరుశనగ	2,138	1,038	49
నువ్వులు	1,123	59	5
పొద్దుతిరుగుడు	2,112	89	4
శనగ	49	3	6
మినుము	1,986	349	18
అలసంద	2,617	422	17
పెసలు	2,896	195	7
ఉలవలు	35	2	6
కంది	142	45	32
ఇతరములు	35,692	39,622	111

సాగు పెరిగే అవకాశం ఉంది



యాసంగిలో పంటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఈనెల 15 వరకు వరి సాగు చేసే అవకాశం ఉంది. వివిధ పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా తమ పంటలపై తప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

ఈసారి విస్తీర్ణం తక్కువే



పంట వేసింది మొదలు దిగుబడులు వచ్చే వరకు రైతులు అనేక ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ధాన్యం కొనుగోళ్ల విషయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. అందుకే ఈసారి వరి వేయడానికి వెనుకా ముందు ఆలోచించాల్సి వస్తోంది. ఈ ప్రభావం అన్ని పంటలపైనా పడే అవకాశం ఉంది.

– వాంకుడోత్ కోబల్, రేగళ్ల, లక్ష్మీదేవిపల్లి మండలం

అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న కేరళ అర్చకులు

పాల్వంచ: పాల్వంచలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి గణపతి హోమం, బింబశుద్ధి, కలశ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, ఆదివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. కేరళలోని ప్రధాన అయ్యప్ప ఆలయ వంశపారంపర్య అర్చకులు మహేశ్వరారు మోహనారరు తంత్రి, కంటారరు మోహనరరు తంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. స్థానిక ఆలయ ప్రధాన అర్చకులు నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు బి.శ్రీనివాస్, మిర్యాల కమలాకర్, కనగాల రాంబాబు, మేడిద సంతోష్, కొత్వాల శ్రీనివాసరావు, కాల్వ భాస్కరరావు, చావా కిషోర్, శంకర మణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



షమీవుద్దీన్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన 5వ నేషనల్ మాస్టర్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన జిమ్ యజమాని షమీవుద్దీన్ గోల్డ్ మెడల్ సాధించారు. శనివారం తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి.మల్లేష్ వివరాలు వెల్లడించారు. షమీవుద్దీన్ 75 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను మల్లేష్, కోచ్ కూచెన కృష్ణారావు తదితరులు అభినందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న శివరాంప్రసాద్

ఇల్లెందు: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరాంప్రసాద్ పేర్కొన్నారు. ఇల్లెందులోని హరిప్రియ ఫౌండేషన్ భవన్‌లో వారం రోజులుగా శిక్షణ పొందుతున్న మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 రోజులపాటు 60 మంది శిక్షణ పొందితే కుటీర పరిశ్రమ ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ తోడ్పానందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఈడీపీ ట్రైనర్ మహేందర్, టైలరింగ్ విభాగం శిక్షకురాలు సంధ్యారాణి, కో ఆర్డినేటర్ రావూరి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

పినపాక: మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ మోహన్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ మండల పరిషత్ అధికారి శ్రీనివాసులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. అత్యవసర నిమిత్తం ఫోన్ చేసినా స్పందించకపోవడం, మండల పరిషత్ అధికారికి తెలపకుండా సమాచారాన్ని ప్రజా ప్రతినిధులకు చేరవేయటం, ఇతరుల ముందు అధికారిని కించపరుస్తూ మాట్లాడటం, మెమోలు జారీ చేసినా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను శనివారం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు తమ దుకాణాల ముందు రోడ్డుపై మరో దుకాణం ఏర్పాటు చేసి, రూ. 5 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించొద్దని సూచించారు. డ్రెయినేజీ కాలువ దాటి ఎవరూ దుకాణం ఏర్పాటు చేయొద్దని చెప్పారు.

సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల కోసం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ప్రధాన తపాలా కార్యాలయం హెడ్ పోస్టుమాస్టర్ ఆర్.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10వ తేదీల్లో ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆడ బిడ్డల బంగారు భవిష్యత్ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైకుంఠధామంలో సామగ్రి చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ వైకుంఠధామంలో సామగ్రి చోరీకి గురైంది. గ్రామపంచాయతీ సిబ్బంది శనివారం ఉదయం వైకుంఠధామాన్ని సందర్శించిన సమయంలో గమనించి సర్పంచ్ ధనసరి స్రవంతి దృష్టికి తెచ్చారు. దీంతో పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి తిరుపతిరావు పరిశీలించి సింథటిక్ ట్యాంక్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఏడాది వ్యవధిలో వైకుంఠధామం సామగ్రి చోరీకి గురికావడం ఇది రెండోసారని సర్పంచ్ తెలిపారు.

రుణాలెప్పుడిస్తారో..?

- నాలుగేళ్లుగా బీసీ కార్పొరేషన్ లోన్లు బంద్
- స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

కొత్తగూడెంరూరల్: నాలుగేళ్లుగా బీసీ కార్పొరేషన్ రుణాల నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. జిల్లా ఏర్పడ్డాక ఒకసారి మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఎదురుచూపులు తప్పడంలేదు. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 1,746 యూనిట్లను రూ.8.73 కోట్ల సబ్సిడీతో రుణాలు అందించారు. 2018–19 నుంచి ఇప్పటివరకు రుణాల నోటిఫికేషన్ ఇవ్వలేదు. పాలకుల నిర్లక్ష్యం వల్ల బీసీ నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందలేకపోతున్నారు. పలుమార్లు కలెక్టర్, ఇతర అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక, స్వయం ఉపాధి పొందలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల తర్వాత మైనారిటీలకు రుణాల నోటిఫికేషన్ ఇవ్వగా, మైనారిటీ నిరుద్యోగులకు కొద్దిమేర ఊరట కలిగింది. మైనారిటీ రుణ నోటిఫికేషన్ లాగే బీసీ కార్పొరేషన్ నుంచి కూడా రుణ నోటిఫికేషన్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 70 యూనిట్లు మంజూరుకాగా, 3,777 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని బట్టి పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.




జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం

2017–18 సంవత్సరంలో...

జిల్లాలో 2017–18 సంవత్సరంలో రూ.8.73 కోట్ల సబ్సిడీతో 1,746 యూనిట్లు బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 491 యూనిట్లకు రూ.2.45 కోట్లు, సావిత్రి బాయి పూలే యోజన కింద 163 యూనిట్లకు రూ.81.50 లక్షలు, మోస్ట్ బ్యాక్‌వార్డ్ కేటగిరీలో 34 యూనిట్లకు రూ.17.50 లక్షలు, రజక ఫెడరేషన్ ద్వారా 364 యూనిట్లకు రూ.1.82 కోట్లు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా 197 యూనిట్లకు రూ.98.50 లక్షలు, వడ్డెర ఫెడరేషన్ ద్వారా 120 యూనిట్లకు రూ.60 లక్షల సబ్సిడీ ఇచ్చారు. బట్టురాజ ఫెడరేషన్ ద్వారా 4 యూనిట్లకు రూ.2 లక్షలు, ఉప్పెర ఫెడరేషన్ ద్వారా 36 యూనిట్లకు రూ.18 లక్షలు, వాల్మీకిబోయ ఫెడరేషన్ ద్వారా 13 యూనిట్లకు రూ.6.50 లక్షలు, కుమ్మరి శాలివాహన ఫెడరేషన్ ద్వారా 51 యూనిట్లకు రూ.25.50 లక్షలు, విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా 132 యూనిట్లకు రూ.66 లక్షలు, మేదరి ఫెడరేషన్ ద్వారా 12 యూనిట్లకు రూ.6 లక్షలు, గీతా కార్మికుల ఫెడరేషన్ ద్వారా 139 యూనిట్లకు రూ.69.50 లక్షల సబ్సిడీతో లబ్ధిదారులకు రుణాలు అందించారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



బీసీలకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఇప్పటివరకు మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే కలెక్టర్ అనుమతితో రుణ నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

– సురేందర్, ఈడీ, బీసీ సంక్షేమ శాఖ

జీఓ నం.45ను రద్దు చేయాలి

అసెంబ్లీలో గళమెత్తిన భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం: ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా భద్రాచలం పట్టణాన్ని మూడు ముక్కలుగా చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 45ను రద్దు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన గళమెత్తారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ ప్రభుత్వం అసంబద్ధమైన జీఓ జారీ చేసిందని ఆరోపించారు. వెంటనే భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. జాప్యం చేయకుండా అర్హులైన పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఎంతో సారవంతమైన భూములను సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారని, ఎకరాకు కనీసం రూ.30 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి, నేటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సెయింట్ జోసఫ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆద్యంతం సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి 1969 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ నుంచి 2022 బ్యాచ్ వరకు 54 బ్యాచ్‌లకు చెందిన సుమారు 1,500 మంది విద్యార్థులు కుటుంబాలతో హాజరయ్యారు. తొలుత పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకల జెండాలను ఆవిష్కరించి, పాటలు పాడారు. 1963లో పాఠశాల స్థాపించగా, ఎంతో మందిని తీర్చిదిద్దిందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులను సన్మానించారు. జ్ఞాపికలు, పూల మొక్కలు అందజేశారు. ఈ నెల 5న పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలు జరుగుతాయని, అందరూ హాజరై విజయవంతం చేయాలని ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. పాఠశాల పూర్వవిద్యార్థుల ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ రోజా కిరణ్, ఓఎస్ఏ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, సీనియర్ అడ్వైజర్ బి సాయికృష్ణ, జనరల్ సెక్రటరీ కవిత, షేక్‌స్పియర్, మొబిన్ పాషాయ, వైస్ ప్రిన్సిపాల్ జోషి, డాక్టర్ మాలతి, జీకే సంపత్, ఎల్‌జే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చిన ఏడాదికే...

గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగం వచ్చిన ఏడాదికే సింగరేణి కార్మికుడు గని ప్రమాదంలో మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా రామగుండం-3 ఏరియాలోని ఓసీపీ-1 ప్రాజెక్ట్‌లో శనివారం ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చుంచుపల్లి మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన బట్టి భాస్కర్ కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కొడుకు ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు జయంత్‌కుమార్(30) పట్టుదలతో కష్టపడి చదివి సింగరేణిలో ఉద్యోగం సాధించాడు. గతేడాది జనవరి 12న సింగరేణిలో వెల్డర్‌గా విధుల్లో చేరాడు. ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1లో పనిచేస్తున్నాడు. శనివారం గనిలో వెల్డింగ్ పూర్తిచేసుకుని వస్తుండగా సర్వీస్ ఫీడర్ పక్కన ఉన్న ఫైర్ ఎస్టింగర్(మంటలను ఆర్పే పరికరం) పేలి జయంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సింగరేణి ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఆదివారం కొత్తగూడెం తీసుకురానున్నారు. కాగా ఇప్పుడిప్పుడే కుటుంబం స్థిరపడుతుండగా గని ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



బట్టి జయంత్ కుమార్(ఫైల్)

‘టేబుల్ టెన్నిస్’లో స్వర్ణపతకాలు..

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తగూడెం రాంనగర్‌కు చెందిన షేక్ రియాజ్ రెండు స్వర్ణ పతకాలను, ఒక కాంస్య పతకం సాధించాడు. మిక్స్‌డ్ డబుల్స్, మెన్స్ డబుల్స్‌లో రెండు స్వర్ణ పతకాలను, సింగిల్స్‌లో కాంస్య పతకం పొందాడని శనివారం జిల్లా క్రీడా అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్‌ను అభినందించారు.



స్వర్ణపతకాలు సాధించిన రియాజ్

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముదిగొండకు చెందిన కట్టకూరి సాయి(25) ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రానైట్ లోడింగ్ వర్కర్‌గా పనిచేసే ఆయన కొద్ది రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండగా చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకున్నాడు. అంగన్‌వాడీ సెంటర్ నుంచి వచ్చిన భార్య మనీషా కిటికీలో నుంచి చూసి, స్థానికులకు చెప్పడంతో పీహెచ్‌సీకి తరలించేలోగా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై సాయి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు..



కేసు నమోదు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

జూలూరుపాడు/చంద్రుగొండ: ఎక్సైజ్‌శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు చంద్రుగొండ, జూలూరుపాడు మండలాల్లో శుక్ర, శనివారాల్లో దాడులు చేశారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులతోపాటు నిబంధనలు పాటించని మద్యం దుకాణాల యజమానులపై కూడా కేసులు నమోదు చేశారు. తిప్పనపల్లి, చంద్రుగొండ, మద్దుకూరు, మంగయ్యబంజర్, దుబ్బతండా, రావిగూడెం, పోకలగూడెం, పాపకొల్లు, పడమటనర్సాపురం, కాకర్ల, కొమ్ముగూడెం, తదితర గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై దాడి చేశారు. సుమారు 100 బాటిళ్లకు పైగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూలూరుపాడు మండలానికి చెందిన కాకర్ల గ్రామానికి చెందిన గోపాల్‌రావు, చంద్రుగొండకు చెందిన రాములు, మంగయ్య బంజరకు చెందిన నరసింహారావులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు, ఎస్సైలు ఐఅశోక్ కుమార్, డి.సాయి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

పాల్వంచ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ బృందాలు శనివారం పట్టుకున్నాయి. పాల్వంచ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ కథనం ప్రకారం... శుక్రవారం పెద్దమ్మగుడి సమీపంలో మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్నవ్యక్తిని ఆపేందుకు ప్రయత్నించగా.. వాహన దారుడు తన చేతిలోని బ్యాగ్ పడేసి అతివేగంతో వెళ్లిపోయాడు. బ్యాగ్‌ను పరిశీలించి, అందులో ఉన్న మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహనం నంబర్ ఆధారంగా అతని చిరునామా గుర్తించి శనివారం అరెస్ట్ చేశారు. సీలేరు నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ మురళి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ముబాషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆర్‌అండ్‌ఆర్’ ప్లాట్ల పంపిణీలో వివాదం

మణుగూరుటౌన్: బీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసేందుకు ఏర్పాటు చేసిన రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయినవారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద చేపట్టిన ప్లాట్ల పంపిణీలో శనివారం వివాదం చోటుచేసుకుంది. ప్యాకేజీలో భాగంగా ముత్యాలమ్మనగర్‌లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులు పంపిణీకి సిద్ధం చేశారు. కాగా మద్దులగూడేనికి చెందిన కలబోయిన లక్ష్మణ్, భిక్షం, నాగేశ్వరరావు తదితరులు ప్రభుత్వం పంచాలనుకున్న భూమిలో తమకు మూడెకరాలు ఉందని, పట్టాలు కూడా ఉన్నాయని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు చూపాలని, అక్కడి నుంచి ఆందోళనకారులను పంపించిచేశారు. ఈ విషయమై మణుగూరు తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ అక్కడ వారికి భూమి లేదని తెలిపారు.



ఆందోళనకారులను పంపించి వేస్తున్న పోలీసులు

మేం పాఠాలు చెప్పం..!

పోకలగూడెం పాఠశాలలో భాషా పండిట్ల ఆందోళన

చంద్రుగొండ : తమకు ప్రమోషన్ల ప్రక్రియలో అన్యాయం జరుగుతోందని, న్యాయం చేసేంత వరకు పాఠాలు చెప్పబోమని చంద్రుగొండ మండలం పోకలగూడెం జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు (భాషాపండిట్లు) శనివారం ఆందోళన చేశారు. స్కూల్ అసిస్టెంట్, గణితం, ఫిజిక్స్, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టు ఉపాధ్యాయులతో సమానంగా శ్రమించి విద్యాబోధన చేస్తున్నప్పటికి ప్రభుత్వం తమ పట్ల చిన్నచూపు చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతులు తమకు 15 ఏళ్లుగా అందనిద్రాక్షగానే మిగిలాయన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రమోషన్ల ప్రక్రియలోనే తమకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, తమకు పాఠాలు చెప్పాలంటూ పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను వేడుకోగా, తమ డిమాండ్‌లు నెరవేరితే సెలవు రోజుల్లో అయినా పాఠ్యాంశాలు బోధిస్తామని వారు హామీ ఇచ్చారు.



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులను పాఠాలు చెప్పాలని వేడుకుంటున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

కల్లూరు: కల్లూరులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జలవనరులశాఖ కార్యాలయంలో లష్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయినేని సతీశ్ (38) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక రాధాకృష్ణమూర్తి ఆస్పత్రి రోడ్డులోని మూలమలుపు మీదుగా వాహనంపై వస్తున్న యువతిని తప్పించే క్రమంలో పల్సర్ బైక్ నడుపుతున్న సతీశ్ కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలు కాగా, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కాగా, సతీశ్ స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా కాగా, ఆయన భార్య స్వాతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రఘు తెలిపారు.



సతీశ్ (ఫైల్)

రూ. 2.03 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌కు చెందిన ఉద్యోగి కామినేని సింధు ఖాతా నుంచి రూ.2,03,103ను సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్న ఘటన ఇది. పోస్టల్ శాఖలో ఉద్యోగి అయిన సింధు సెల్‌కు ఈనెల 2న ఖాతాను అప్‌డేట్ చేసేందుకు ఓటీపీ చెప్పాలని ఫోన్ వచ్చింది. దీంతో ఆమె ఓటీపీ చెప్పగానే ఖాతా నుంచి రూ.2 లక్షలకు పైగా నగదు డ్రా అయింది. ఈ మేరకు బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వగా మొబైల్ డేటా ఆఫ్ చేయాలని సూచించారు. అనంతరం ఆమె శనివారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అక్రమ వెంచర్లపై కొరడా

నేలకొండపల్లి: అక్రమ వెంచర్లపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం కొరడా ఝళిపించింది. నేలకొండపల్లి, రాయగూడెం పంచాయతీల్లో లేఔట్ లేని వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయొద్దని కూసుమంచి సబ్ రిజిస్ట్రార్‌కు మండల పరిషత్ అధికారులు శనివారం లేఖ అందజేశారు. నేలకొండపల్లి పంచాయతీలో నాలుగు, రాయగూడెం పంచాయతీలో ఒక వెంచర్ ఉన్నట్లు గుర్తించి లేఖ ఇవ్వడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. కాగా, గతంలో కలెక్టర్‌కు పలుమార్లు చేసిన ఫిర్యాదుతో స్పందించిన అధికారులకు సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ శనివారం కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న చిన్నారి...

గత నెల 30న భవనం పైనుంచి పడడంతో ప్రమాదం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్-5లో భవనం రెండో అంతస్తు నుంచి కింద పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మధ్యప్రదేశ్ నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన దంపతులు శ్రీనగర్‌లోకాలనీలో పనికి కుదిరారు. గత నెల 30న వారు తమ కుమారుడు ప్రయాన్స్ కారే (2)తో కలిసి రెండో అంతస్తులో పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బాలుడు కింద పడగా ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు వెల్లడించారు.



ప్రయాన్స్(ఫైల్)



కల్లు రుచి సూపర్

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు హాజరైన మంత్రిగారు.. పనిలో పనిగా కల్లు తాగారు. రుచి బావుందని కితాబు కూడా ఇచ్చారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలో శనివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటమయ్య గుడి (కల్లు అడ్డా) వద్ద గీత కార్మికుల కోరిక మేరకు కల్లు దమ్ముపట్టి భలే బాగుందని మెచ్చుకున్నారు.

– దేవరుప్పుల

వందేభారత్‌పై రాళ్ల దాడి

ఖమ్మం క్రైం: ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై కొందరు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటనపై ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఖమ్మం ఆర్పీఎఫ్ పోలీసులకు ఫోన్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం సాయంత్రం ఖమ్మం స్టేషన్‌లో ఆగి తిరిగి బయల్దేరింది. ఈక్రమంలో ఖమ్మం శివార్లలో కొందరు రాళ్లతో దాడి చేయగా ఓ అద్దం ధ్వంసమైంది. దీంతో రైలు సిబ్బంది విశాఖపట్నం వెళ్లాక అద్దం మార్పించారు. అనంతరం ఘటనపై ప్రధానమంత్రి కార్యాలయం అధికారులు ఖమ్మం ఆర్పీఎఫ్ కార్యాలయానికి శనివారం ఫోన్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ రావడం వాస్తవమేనని ధ్రువీకరించారు. వందేభారత్ రైలు లోపల, బయట ఉన్న అత్యాధునిక సీసీ కెమెరాల ద్వారా ఏం జరిగినా పీఎంవోలోని వందేభారత్ విభాగానికి తెలిసిపోతుందని పేర్కొన్నారు. ఖమ్మం శివార్లలో జరిగిన దాడిని గుర్తించిన వారు ఫోన్ చేయగా.. సీసీ ఫుటేజీల ఆధారంగా రాళ్లతో దాడి చేసింది ముగ్గురు బాలురని తేలడంతో వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం ఖమ్మం శివారు రామన్నపేట ప్రాంతంలోనూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లు విసిరిన వారిని కూడా గుర్తించటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

సకాలంలో సత్యాన్ని వెలికితీయాలి

- దీనిలో ఫోరెన్సిక్ సైన్స్ పాత్ర కీలకం
- నల్సార్ వర్సిటీ సదస్సులో మాజీ సీజేఐ జస్టిస్ యు.యు. లలిత్



సదస్సులో పాల్గొన్న జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, వీసీ కృష్ణదేవరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: నేరాలు జరిగినప్పుడు సకాలంలో సత్యాన్ని వెలికితీయడం కత్తిమీద సాము లాంటిదని, దీనిలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు. లలిత్ అన్నారు. ట్రూత్ ల్యాబ్ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఫోరెన్సిక్ సైన్స్ వినియోగంపై నల్సార్ యూనివర్సిటీ శనివారం ఇక్కడ నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. క్రిమినల్ కేసుల్లోనే కాదు, సివిల్ కేసుల్లోనూ ఫోరెన్సిక్ సైన్స్ సేవలు అందించాలని సూచించారు. పరిశోధనకు కొత్త మార్గాలను అనుసరించడంతోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీని ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉందని మరో మాజీ సీజేఐ జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య అభిప్రాయపడ్డారు. శాస్త్రీయంగా సాక్ష్యాన్ని సమర్థవంతంగా రూపొందించడంలో ఫోరెన్సిక్ పాత్ర కీలకమైనదని అన్నారు.

ఆధారాలను వెలికితీయడంలో...

న్యాయ రంగంలో ఫోరెన్సిక్ సైన్స్ సహకారం అవసరమని, తద్వారా క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించే వీలు కలుగుతుందని తమిళనాడు మాజీ గవర్నర్ రాంమోహన్‌రావు అన్నారు. క్రిమినల్ కేసులు, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో ఆధారాలను వెలికితీసేందుకు ఫోరెన్సిక్ సైన్స్ తోడ్పడుతుందని తెలంగాణ హైకోర్టు సీజే, నల్సార్ వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానించారు. ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. రాంమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా, లా కమిషన్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ జస్టిస్ ఎం.జగన్నాథరావు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీవీ రెడ్డి తదితరులు మాట్లాడారు. డీజీపీ అంజనీకుమార్, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ భవానీ ప్రసాద్, జస్టిస్ రఘురామ్, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవరావు, డా.గాంధీ పీసీ కాజా, పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూకే కోర్సుకు 15 మంది తెలంగాణ విద్యార్థులు



- రాష్ట్రంతో బ్రిటిష్ కౌన్సిల్ భాగస్వామ్య ఒప్పందం
- రాష్ట్రాన్ని విజ్ఞాన కేంద్రంగా మార్చడమే లక్ష్యం: మిత్తల్

సాక్షి, హైదరాబాద్: యూకేలో స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. రెండు వారాల కాలవ్యవధితో అందించే ఈ కోర్సుకు అయ్యే ఖర్చును బ్రిటిష్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లోంచి పూర్తిగా మెరిట్ ప్రాతిపదికగా 15 మందిని ఎంపిక చేశారు. హైదరాబాద్ విద్యాభవన్‌లో శనివారం కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, బ్రిటిష్ కౌన్సిల్ ప్రతినిధులు భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా 'స్కాలర్‌షిప్ ఫర్ ఔట్‌స్టాండింగ్ అండర్ గ్రాడ్యుయేట్ టాలెంట్ (స్కాట్)' ప్రోగ్రామ్ వివరాలను బ్రిటిష్ కౌన్సిల్ సౌత్ ఇండియా డైరెక్టర్ జనక పుష్పనాథన్ వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోలో 'హౌ టు బీ మోర్ రేషనల్ క్రియేటివ్ థింకింగ్, లాజిక్ అండ్ రీజనింగ్ (హేతుబద్ధంగా ఉండటం ఎలా? విమర్శనాత్మకత, తర్కం, హేతువాదన) అనే అంశాలపై మార్చి, ఏప్రిల్‌లలో రెండు వారాలపాటు కోర్సు చేస్తారని తెలిపారు. విద్యార్థులకు అవసరమయ్యే వీసా, ప్రయాణ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, యూకేలో కోర్సు ఫీజులు, వసతి, ఇతర ఖర్చులను బ్రిటిష్ కౌన్సిల్ భరిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆధునిక విజ్ఞాన కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు.

చంద్రబాబునూ సీబీఐ విచారించాలి

- వివేకా హత్యలో ఆయన ప్రమేయం.. సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని డిమాండ్
- తండ్రిపై ఆక్రోశంతో సీఎం జగన్‌పై లోకేశ్ పిచ్చి విమర్శలు
- టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. ప్రమాదాలు, గుండెపోట్లు
- ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి
- ఎన్టీఆర్ మృతిపై దర్యాప్తు చేయాలని మోదీ, అమిత్ షా, కేసీఆర్, జగన్‌ను కోరుతా



సాక్షి, అమరావతి: 'మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు సీఎంగా చంద్రబాబే ఉన్నారు.. ఈ కేసులో ఆయన ప్రమేయం ఉంది. అందువల్ల చంద్రబాబును కూడా సీబీఐ విచారించాలి'అని ఏపీ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వివేకా హత్య జరిగిన రోజు వైఎస్సార్ జిల్లా నుంచి చంద్రబాబుతో ఎవరెవరు ఫోన్‌లో మాట్లాడారు? ఈ ఘటన జరిగాక మూడు నెలల వరకు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. మరి అప్పుడు ఎందుకు దోషులను పట్టుకోలేకపోయారు? ఆ హత్యలో ఆయన కూడా భాగస్వామి కనుకే పట్టుకోలేదా'అనే విషయాలన్నింటిపై సీబీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలు బయట పడతాయనే అప్పట్లో సీబీఐ రాష్ట్రంలోకి రాకూడదని చంద్రబాబు బ్యాన్ చేశారని గుర్తు చేశారు. అందువల్లే చంద్రబాబు, లోకేశ్, ఏబీ వెంకటేశ్వరరావు, అప్పటి డీజీపీ, కడప ఎస్పీ, కడప జిల్లాలోని టీడీపీ నాయకుల ఫోన్ కాల్స్‌పై ఆరా తీసి, సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నాని ఇంకా ఏమన్నారంటే..

వివేకా కేసుపై తప్పుడు ప్రచారం

- అన్ని కోణాల్లో వివేకానందరెడ్డి కేసుపై సీబీఐ విచారిస్తుంటే, దానికీ ఈ ఫోర్ ట్వంటీలు, పచ్చ మీడియాలు వక్రభాష్యం చెబుతున్నాయి. వారికి తోచిన వారందరినీ ముద్దాయిలు చేసేస్తారు. సీఎం సతీమణి వైఎస్ భారతమ్మనూ చేరుస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు.
- చంద్రబాబు భార్యను మేం ఏమీ అననప్పటికీ వెక్కివెక్కి ఏడ్చాడు. భారతమ్మను మాత్రం నిందిస్తాడు. అవినాష్ రెడ్డి అయినా, నేనైనా, మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా సీఎం జగన్‌తో మాట్లాడాలంటే ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికో, లేదా నవీన్, లేదా కేఎన్ఆర్‌కో ఫోన్ చేసి మాట్లాడాల్సిందే కదా? ఈ విషయం అందరికీ తెలుసు. అయినా వక్రభాష్యాలా?
- వివేకానందరెడ్డి చనిపోయిన తర్వాత అవినాష్ రెడ్డి ఆ సమాచారం చెప్పడానికి వాళ్లకు ఫోన్ చేశారు. ఇందులో ఏం కొంపలు అంటుకుపోయాయని రామోజీరావు, చంద్రబాబు, బీఆర్ నాయుడు, రాధాకృష్ణ ఇష్టమొచ్చినట్లు దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నట్లు?
- బలవంతంగా పాదయాత్ర చేయిస్తున్నాడని తండ్రి చంద్రబాబుపై లోకేశ్‌కు మంట. తిండికి తప్ప దేనికీ పనికి రాని లోకేశ్.. తండ్రిపై ఉన్న ఆక్రోశంతో సీఎం జగన్‌పై పిచ్చి విమర్శలు చేయడం మానుకోవాలి. పప్పు గుత్తి లోకేశ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి.
- లోకేశ్ పాదయాత్రలో జనం ఎవరూ లేరు. నడవలేక కాళ్లు రుద్దుకుపోతున్నాయట. నువ్వు నడిచే నడకకు రోజుకు 20 సార్లు ఆయిల్ రాయాలంట. ఇది చాలదన్నట్లు నోరు తిరగని మూతి.. ఆ నోటితో సీఎం జగన్‌ను తిట్టడం.. ఇది తప్ప నీకేం తెలుసు?

ఎన్టీఆర్ మరణంపై హరికృష్ణ దర్యాప్తు కోరలేదా?

నారా రామ్మూర్తి నాయుడి అదృశ్యానికీ కారకుడు బాబే. ఆనాడు ఎన్టీఆర్ మరణానికీ చంద్రబాబే కారకుడు. టీడీపీలోకి ఎన్టీఆర్ వారసులు వస్తుంటే.. గుండెపోట్లు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. తన తండ్రి మరణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని ఆనాడు హరికృష్ణ కోరారు. కావాలంటే పాత పేపర్లు తిరగేయండి. చంద్రబాబు చరిత్ర అందరికీ తెలుసు. మోదీ, అమిత్‌షా, కేసీఆర్, వైఎస్ జగన్‌ని ప్రత్యక్షంగా కలిసి ఎన్టీఆర్ మరణంపై దర్యాప్తు చేయాలని కోరతాను.

అందోల్ జోగిపేట చైర్మన్‌ను దింపేద్దాం

- 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంతకాలు
- కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేత

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాలోని అందోల్–జోగిపేట మున్సిపాలిటీ రాజకీయాలు ఊహించని విధంగా రోజుకో మలుపు తిరుగుతున్నాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై సొంత పార్టీ (బీఆర్ఎస్)కి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీనిపై శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో నోటీసును అందజేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. శనివారం ఉదయం 11 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమ కుటుంబ సభ్యులతో కలసి చిట్కుల్‌లోని చాముండేశ్వరీ అమ్మవారి ఆలయం ఆవరణలో సమావేశమయ్యారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల వ్యవహారశైలిపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, వారిని పదవిలో నుంచి దింపేయాలని తీర్మానించారు. అక్కడ నుంచి నేరుగా సంగారెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ కలెక్టర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ వీరారెడ్డిని కలిశారు. ఆయన సూచన మేరకు ఇన్‌వార్డులో అవిశ్వాస తీర్మానం నోటీసును అందించారు. అక్కడి ఉద్యోగులు సోమవారం వచ్చి కలెక్టర్‌ను కలవాలని సూచించడంతో నోటీసు అందించి వెనుదిరిగారు.

మెజారిటీ కౌన్సిలర్ల వ్యతిరేకత

అందోల్ – జోగిపేట మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులున్నాయి. ఇందులో 14 మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం వీరిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు చైర్మన్‌ను వ్యతిరేకిస్తున్నారు. రోజూ చైర్మన్ వెంట ఉండే కౌన్సిలర్లు సైతం బహిరంగంగా చైర్మన్ తీరుపై విమర్శలు చేయడం విశేషం. కాగా, ఈ పరిణామంపై ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

ఎస్సీ కమిషన్‌కు ఆ అధికారం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించింది. స్పందించిన కమిషన్ 2022, నవంబర్ 29న జీవోలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ ఉత్తర్వుల కారణంగా బీసీ, ఓసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కొండెపాక కుమారస్వామి, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టగా పిటిషనర్ తరఫున సుంకర చంద్రయ్య వాదనలు వినిపించారు. ఆయన వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి జాతీయ ఎస్సీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేశారు. ప్రభుత్వసంస్థల ఉద్యోగుల సర్వీసు అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు విచారణ జరిపే అధికారం లేదని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.

వివరాలను సమర్పించండి


విద్యుత్‌సంస్థల్లో పదోన్నతుల్లో ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి ఇచ్చిన ప్రమోషన్లు అన్నింటిని సమీక్షించాలని 2019లో హైకోర్టు విద్యుత్ సంస్థలను ఆదేశించింది. అయినా ఆదేశాలను అమలు చేయకపోవడంతో ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీలపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన ఉన్నతన్యాయస్థానం ఫిబ్రవరి 8న వివరాలను సమర్పించాలని యాజమాన్యాలను ఆదేశించింది.

రామయ్యకు రూ.2.90లక్షల విలువైన ఆభరణాలు


ఆభరణాలను ఈఓకు అందిస్తున్న దాత

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారికి బెంగళూరుకు చెందిన భక్తులు బంగారు ఆభరణాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన లక్ష్మీదేవి రూ.2.90 లక్షల విలువైన 46 గ్రాముల బంగారంతో బంగారు కడియం, నెక్లెస్‌లను చేయించారు. వాటిని శనివారం మూలమూర్తుల పాదాల చెంత పూజలు నిర్వహించాక ఈఓ శివాజీకి అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు, అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జిల్లాలో జలవనరుల శాఖ పరిధిలో జరిగిన పనుల నాణ్యతను కేంద్ర బృందం సభ్యుడు సాయిఆదిత్య పరిశీలించారు. జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వ 54వ ప్యాకేజీ పరిధిలో జరిగిన పనులను శుక్ర, శనివారాల్లో ఆయన పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కూసుమంచి, తదితర మండలాల పరిధిలో ఆయన పర్యటించగా, యూటీలు, ఓటీలు, డ్రాప్టులు, కల్వర్టులను తనిఖీ చేశారు. పాలేరు డివిజన్ ఈఈ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

కొక్కిరేణి చెరువుకు 'భక్త రామదాసు' నీరు


కాల్వలో వెళ్తున్న నీరు

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి చెరువుకు శనివారం ఇరిగేషన్ అధికారులు భక్త రామదాసు ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. ఇన్నాళ్లు కొక్కిరేణి చెరువుకు ప్రత్యేక కాల్వ లేకపోవడంతో నీటి విడుదల సాధ్యం కాలేదు. ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డి ఆధ్వర్యాన కాల్వ ఏర్పాటు చేసి నీరు విడుదల చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా వార్తలు

నీటి యాజమాన్యంపై అవగాహన

- రైతులకు ఉద్యోగులు సలహాలు, సూచనలు ఇవ్వాలి
- ఖమ్మం డీఏఓ విజయనిర్మల


శిక్షణలో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల, పక్కన అధికారులు

వైరా: వాననీటిని ఒడిసిపట్టడం, నీటి యాజమాన్య పద్ధతులు పాటించడంపై రైతులకు ఏఈఓలు అవగాహన కల్పించాలని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. వైరా రైతు వేదికలో ఏఈఓలకు రెండు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణను శనివారం ఆమె హైదరాబాద్‌కు చెందిన వాటర్ అండ్ లాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(వాలంటరీ) డైరెక్టర్ డాక్టర్ బి.కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉండే ఏఈఓలు వాన నీటిని ఇంకుడు గుంతల్లో నిల్వ చేసుకోవడం, ఆరు తడి పంటల వల్ల లాభాలపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎంతో విలువైన నీరు, భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిగా ఉన్నందున ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు వి.బాబూరావు, సునీత, ఏఓలు అన్నపూర్ణ, పవన్‌కుమార్, బాలాజీ, వాహిని తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు క్షేత్ర సందర్శన

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం జోగ్గూడెంలో రైతులు సాగుచేసిన పొద్దుతిరుగుడు పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయ నిర్మల శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పొద్దుతిరుగుడు పూల వెనుక భాగం నిమ్మ పచ్చ రంగులోకి మారాకే కోసి ఆరబెట్టి విత్తనాన్ని వేరు చేయాలని తెలిపారు. గింజల్లో తేమ 9 నుంచి 10శాతం వచ్చే వరకు ఎండబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఏ.శ్రీనివాసరావు, ఏఓలు తారాదేవి, ఉమామహేశ్వరరెడ్డి, సర్పంచ్ భగవాన్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా విద్యావిధానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ వారియర్, పక్కన హార్వెస్ట్ యజమాన్యం రవిమారుత్, నాగమణి, పార్వతీరెడ్డి తదితరులు (ఇన్‌సెట్) నృత్యం చేస్తున్న విద్యార్థులు

- 'హార్వెస్ట్' వార్షికోత్సవంలో సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మం సహకారనగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు అవసరమని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల 21వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించగా సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. అందుకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు పాఠశాలల యజమాన్యాలు కృషి చేయాలన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఇతర కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తే మరింత ఉన్నతంగా రాణిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చకుండా, ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని సూచించారు. డీఈఓ సోమశేఖర శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రమ, పరిశోధన, సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తే మంచి ఫలితం ఉంటుందని.. ఇదే దిశగా తమ విద్యాసంస్థల్లో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. క్వెస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ వై.నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధ పెంచుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

డ్రైవర్లు యూనిఫామ్ తప్పక ధరించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీ అద్దె బస్ డ్రైవర్లు తప్పనిసరిగా పూర్తి యూనిఫామ్ ధరించాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ ప్రభులత సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు శనివారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ డ్రైవర్లు బస్ నడిపే సమయాన సెల్‌ఫోన్ వాడొద్దని తెలిపారు. అలాగే, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేశ్ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు మధ్యలో కాకుండా పక్కకు ఆపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ సీఐ అంజలి, ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ మాట్లాడారు.

ప్లాట్లకు హద్దులు నిర్ధారిస్తున్నాం..

రఘునాథపాలెం: ఇటీవల ఖమ్మం జిల్లా వీవీ పాలెంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభ సందర్భంగా చదును చేసిన ప్లాట్లకు తిరిగి హద్దులు నిర్ధారిస్తున్నారు. అప్పట్లో హద్దురాళ్లు తొలగించగా యజమానులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యాన సర్వే అధికారుల మ్యాప్‌ల ప్రకారం మళ్లీ హద్దులు ఏర్పాటుచేయిస్తున్నారు. సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సర్వే ఉద్యోగులు, ప్లాట్ల యజమానుల సమక్షాన ఎవరూ నష్టపోకుండా హద్దులు ఏర్పాటు చేయిస్తున్నామని, ఇప్పటికే 60శాతానికి పైగా ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తొలపునూరి దానయ్య పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

- ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులు ఐటీడీఏ ఆధ్వర్యాన ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణం పీఎంఆర్సీ భవనంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నందున శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. నిష్ణాతులైన అధ్యాపకుల శిక్షణ, సలహాలు, సూచనలను పాటిస్తే విజయం సొంతమవుతుందని తెలిపారు. కాగా, 60 రోజుల శిక్షణ కోసం అవసరమైన మెటీరియల్‌కు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని ఏపీఎంఓ రమణయ్యను పీఓ ఆదేశించారు.


వాయిస్ ఫర్ గర్ల్స్ శిబిరంలో మాట్లాడుతున్న పీఓ

వాయిస్ ఫర్ గర్ల్స్ శిక్షణ పరిశీలన

భద్రాచలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్ శిక్షణను పీఓ గౌతమ్ పొట్రు పరిశీలించారు. హాజరైన విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలిచ్చారు. కార్యక్రమాల్లో డీడీ రమాదేవి, ఏటీడీఓ నర్సింగరావుతో పాటు ఉద్యోగులు బావ్‌సింగ్, సర్వేశ్వర్‌దొర, సతీశ్, వెంకటేశ్వరరావు, సావిత్రి, ద్వారక, సుచిత్ర, ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతుల అభివృద్ధి

- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం


మాట్లాడుతున్న చైర్మన్ నాగభూషణం

గుండాల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు ఇస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఈ విషయంలో పీఏసీఎస్‌ల చైర్మన్లు, సిబ్బంది మరింతగా కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సూచించారు. మండలంలోని బ్యాంకు, సొసైటీలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మండలంలో బ్యాంకు నిర్మాణానికి సరిపడా స్థలం ఉన్నందున నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో పలుచోట్ల రూ.26 కోట్లతో గోదాంల నిర్మాణం జరుగుతోందని, గుండాలలో కూడా మంజూరుకు యత్నిస్తామని చెప్పారు. కాగా, పెండింగ్ రుణాల వసూళ్లు, ధాన్యం అమ్మిన రైతులకు డబ్బు చెల్లింపులో చొరవ తీసుకోవాలని చైర్మన్ సూచించారు. డీసీసీబీ డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ గొగ్గెల రామయ్యతో పాటు ఈసం పాపారావు, నాగరాజు, రాంబాబు, శోభన్, రాంమూర్తి, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ఆత్మహత్యలనూ పరిగణనలోకి తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: కౌలు రైతులు ఆత్మహత్యలను కూడా రైతు ఆత్మహత్యలుగానే పరిగణించి పరిహారం మంజూరుకు కృషి చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. అలాగే, రుణమాఫీ నగదును రైతుల ఖాతాల్లో వడ్డీతో సహా జమ చేయాలన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శనివారం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ దేశంలో రైతుల ఆత్మహత్యలు తక్కువేనంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, 2018 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వడ్డీతో సహా రైతు ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యుత్ కోతలను ఎత్తివేసి, వ్యవసాయానికి పగటి పూట కరెంట్ ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో నాయకులు రాంబాబు, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, దుగ్గి కృష్ణ, ఊరడి సుదర్శన్‌రెడ్డి, మందా సైదులు, చెరకుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, అర్వపల్లి జగన్ మోహన్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.